# పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

సూర్యాపేట, నవంబర్ 29 : సూర్యాపేట నియోజక వర్గ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను కలెక్టర్ ఎస్.వెంకట్రావ్, ఎన్నికల పరిశీలకుడు బాలకిషన్ ముండా బుధవారం పరిశీలించారు. వ్యవసాయ మార్కెట్‌లోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో పోలింగ్ సిబ్బందితో మాట్లాడి వారికి పలు సూచనలు చేశారు. పోలింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. వారి వెంట నియోజక వర్గ ఎన్నికల అధికారి వీరబ్రహ్మచారి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, రంగారావు పాల్గొన్నారు.

**పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి**

తుంగతుర్తి : ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ తెలిపారు. మండల కేంద్రంలో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. పోలింగ్ చిటీ లేదని ఎవరూ అధైర్య పడొద్దని, 12 రకాల గుర్తింపు కార్డులను ఎన్నికల సంఘం గుర్తించిదని వాటిలో ఏదో ఒక దానిని చూపించి ఓటు హక్కు వినియోగించుకోవచ్చని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలని కోరారు.



సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు బాలకిషన్ ముండా



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

# పోలింగ్‌కు పటిష్ట బందోబస్తు

- విధుల్లో 3,500 మందికి పైగా పోలీస్ సిబ్బంది
- ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట సిటీ, నవంబర్ 29 : అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. మొత్తం 3,500 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బుధవారం ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌లను ఎస్పీ పరిశీలించి మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల వద్ద 100 మీటర్లు, 200 మీటర్ల పరిధిలో నిబంధనలు ప్రతి ఒక్కరూ అనుసరించాలన్నారు. జిల్లా అంతటా 144 సెక్షన్ అమలులో ఉన్నందున బయట ఎక్కడా కూడా గుంపులు గుంపులుగా చేరవద్దని సూచించారు. మద్యం అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓటరు కాని వారు గ్రామాలు, వార్డుల్లో ఉండకూడదన్నారు. వెంట పోల్ చిట్టి, గుర్తింపు కార్డు తెచ్చుకోవాలన్నారు. ఓటు వేశాక ఆ ప్రదేశం నుంచి వెళ్లిపోవాలని, అసత్యాలు ప్రచారం చేయవద్దని, పార్టీ జెండాలు, ప్లకార్డ్స్ వెంట తీసుకురావద్దన్నారు. ఇతరులను కించపరిచేలా, రెచ్చగొట్టేలా ప్రవర్తించవద్దని సూచించారు. ఈవీఎం స్ట్రాంగ్ రూముల వద్ద ఆర్మడ్ సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఎస్పీ వెంట డీఎస్పీ నాగభూషణం, ఆర్ఐ నారాయణరాజు, భద్రతా సిబ్బంది, ఎలక్ట్రికల్ సిబ్బంది ఉన్నారు.



చివ్వెంల : పాచ్యానాయక్‌తండా ప్రాథమిక పాఠశాల పోలింగ్ కేంద్రానికి చేరిన ఎన్నికల సిబ్బంది



అడ్డగూడూరు : ఎన్నికల సామగ్రితో పోలింగ్ బూత్‌లకు చేరుకుంటున్న సిబ్బంది



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దర్గా నిర్వాహక సభ్యులు

## వచ్చే నెల 8 నుంచి అర్వపల్లి ఉర్సు

అర్వపల్లి, నవంబర్ 29 : అర్వపల్లి శివారులోని హజ్రత్ ఖాజా నసిరుద్దీన్ బాబా దర్గాలో వచ్చే నెల 8, 9 తేదీల్లో జరిగే ఉర్సు ఉత్సవాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. బుధవారం స్థానిక దర్గా ఆవరణలో ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. 8న గంధం ఊరేగింపు, 9న దీపారాధన కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో దర్గా సూపరింటెండెంట్ నిజాముద్దీన్ సోని, సయ్యద్ అలీ, హబీబ్, సొమ్మ పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణకు సిబ్బంది సిద్ధం

తుంగతుర్తి, నవంబర్ 29 : గురువారం జరిగే పోలింగ్‌కు పూర్తి స్థాయిలో సిబ్బంది నియామకం చేసి ఏర్పాట్లను పూర్తి చేసినట్లు రిటర్నింగ్ అధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఏఎంసీ గోదాములో ఎన్నికల నిర్వహణ కోసం ఈవీఎం, సంబంధిత పత్రాలను సిబ్బందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొత్తం 326 కేంద్రాల్లో 326 బీఎల్‌ఓలు, పీఓ, ఏపీఓలు 550 మందిని నియమించినట్లు తెలిపారు. 37 మంది సెక్టోరియల్ అధికారులు పర్యవేక్షణ చేయనున్నట్లు చెప్పారు. నియోజక వర్గంలో తుంగతుర్తిలో 46, నాగారం-29, తిరుమలగిరి-40, మోత్కూరు-31, అడ్డగూడూరు-30, శాలిగౌరారం-52, జాజిరెడ్డిగూడెం-32, నూతనకల్-35, మద్దిరాలలో 31 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. నియోజక వర్గంలో 106 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకంగా ఉన్నట్లు గుర్తించారు. 407 సీయూబీయూ యూనిట్స్, 456 వీవీ ప్యాడ్‌లను సిద్ధి చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి యాదగిరిరెడ్డి, డీటీ హరిశ్చంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

అడ్డగూడూరు : నేడు జరిగే ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం చేసినట్లు ఎన్నికల సహాయ అధికారి శేషగిరిరావు తెలిపారు. బుధవారం సాయంత్రం ఎన్నికల సిబ్బంది పోలింగ్ బూత్‌లకు చేరుకున్నారు. మండలంలోని మొత్తం 3 రూట్లలో 30 పోలింగ్ బూత్‌లు ఉన్నట్లు వెల్లడించారు. మండలంలో మొత్తం 22,631 ఓటర్లు ఉండగా అందులో పురుషులు 11,190, మహిళా ఓటర్లు 11,441 ఉన్నారు. అర్హులు ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

మోత్కూరు : మండలంలో 31 పోలింగ్ కేంద్రాల్లో 26,953 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వారిలో 13,445 మంది పురుషులు, 13,508 మంది మహిళలు ఉన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేసినట్లు మండల ఎన్నికల సహాయకుడు రాంప్రసాద్ తెలిపారు.

మద్దిరాల : మండలంలోని ఆయా గ్రామాల్లో 31 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 124 మంది అధికారులు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. మండలంలో మొత్తం 24,665 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.



మోత్కూరుకు ఎన్నికల సామగ్రితో చేరుకున్న సిబ్బంది



తిరుమలగిరి జడ్పీహెచ్‌ఎస్‌కు చేరుకున్న పోలింగ్ సిబ్బంది




సూర్యాపేట డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్తున్న సిబ్బంది




తుంగతుర్తి : పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్తున్న సిబ్బంది



మద్దిరాల : పోలుమల్ల గ్రామంలో పోలింగ్ బూత్‌కు చేరిన అధికారులు